క్లుప్తంగా

సీపీఎం మండల కార్యదర్శిగా వినోద్‌నాయక్

మిర్యాలగూడ : సీపీఎం దామరచర్ల మండల కార్యదర్శిగా మాలోతు వినోద్‌నాయక్ రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన సీపీఎం జిల్లా 21వ మహాసభలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగాన్నికైన మాలోతు వినోద్‌నాయక్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి తన వంతుగా పాటుపడుతానని తెలిపారు.

సౌత్ జోన్ చెస్ పోటీలకు గురుకుల విద్యార్థి

దేవరకొండ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో ఈనెల 5నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ ఛాంపియన్ ఫర్ ఉమెన్స్ పోటీలకు దేవరకొండ మండల పరిధిలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని కృష్ణవేణి ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపల్ శ్వేత, పీడీ మహేశ్వరి, వైస్‌ప్రిన్సిపాల్ స్వాతి విద్యార్థినిని అభినందించారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్ అప్రజాస్వామికం

దేవరకొండ : మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు నమోదు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్ ఏర్పాటు హర్షణీయం

వేములపల్లి(మాడుగులపల్లి) : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయడంపై మాడుగులపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సైదులు, నా యకులు బాబు, లక్ష్మణ్, వెంకటయ్య, ఏడుకొండలు, కాశయ్య, ఏడుకొండలు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

హాలియా : అనుముల మండలంలోని సంక్షేమ, గురుకుల, కేజీబీవీ హాస్టల్ విద్యార్థులకు వీరసే, కేజేఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి సొంత ఖర్చులతో సమకూర్చిన దుప్పట్లను గురువారం హాలియా పట్టణంలో జిల్లా మాజీ యూత్ అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆంజనేయులు, సైదులు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాండు నాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సైదులు, మట్టారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

నాగార్జునసాగర్ : నందికొండ హిల్‌కాలనీ సెయింట్‌జోసెఫ్ పాఠశాలకు చెందిన జే.సుప్లవి, ఎండీ సుభానూర్‌లు జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 23,24,25తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం కలువల గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ అండర్-17 నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 11,12,13 తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలోగల లూథియానాలో నిర్వహించే జాతీయ స్థాయి క్రీడాపోటీలో ఆడనున్నట్లుగా నల్లగొండ జిల్లా నెట్‌బాల్ అసోషియేషన్ సెక్రెటరీ కిరణ్‌కుమార్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెడ్‌మాస్టర్ సిస్టర్ డా.లలిత, సిస్టర్ క్లారా, పీఈటీ కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

పెద్దవూర : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) పెద్దవూర మండల నూతన కమిటీని గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నియామకపత్రాలు అందజేశారు. మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్య దర్శిగా రవికుమార్‌ను ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చందంపేట: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండల కేంద్రానికి ముక్కామల ఈదయ్య తన పశువులను మేపటానికి వ్యవసాయ పొలంలోకి తోలుకుని వెళ్లాడు. ఈ క్రమంలో ఆవు మేసుకుంటూ జంపర్ వైర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ.60వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- అనుమతులు లేకుండానే రవాణ
- కనుమరుగు అవుతున్న ప్రకృతి సంపద
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ


నసర్లపల్లిలో మట్టిని నింపుతున్న హిటాచి వాహనం


మట్టిని తీసుకెళ్తున్న టిప్పర్లు

చింతపల్లి: మండలంలో జోరుగా అక్రమ మట్టి త్రవ్వకాలు సాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా తరలిస్తూ అందినకాడికిదండుకుంటున్నారు. కాసుల కక్కుర్తి పడి కొందరు అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారు. ఫలితంగా ప్రకృతి సంపాదన కనుమరుగవుతుంది. చింతపల్లి మండలంలో మొరం, మట్టి, వ్యాపారం జోరుగా సాగుతుంది. ప్రభుత్వాలు ఎన్ని నిబంధనలు అమలు చేసిన అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. యథేచ్ఛగా మట్టిని తోడేస్తూ ప్రకృతి సంపదను కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామ శివారులో మూడు రోజుల నంచి హిటాచి, టిప్పర్ల ద్వారా రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమ రవాణ జోరుగా సాగిస్తున్నారు. మండల కేంద్రంలోని మైసమ్మ దేవాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్కు పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి రవాణ జోరుగా సాగుతుంది. దీంతో ప్రకృతి వనరులు కరిగిపోతున్నాయి. వాహనాలను ఎవరైన పట్టుకుంటే ప్రజా ప్రతినిధులు ఉన్నత అధికారులకు చెప్పి వాహనాలను విడిపించుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ఈ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్న అధికారులు మాత్రం రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది.

జోరుగా తవ్వకాలు

చింతపల్లి మండల పరిధి నసర్లపల్లి గ్రామ శివారులోని భూముల్లో అక్రమంగా మట్టిని తోడి ప్రవేట్ వెంచర్లకు అమ్ముకుంటున్నారు. పట్టా భూముల్లో చదునుచేస్తున్నామని ప్రభుత్వ భూముల్లో మొరం, మట్టిని రాత్రి పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. దీంతో కొండలు, గుట్టలు, ప్రకృతి సంపద కనుమరుగవుతుంది, రాజకీయ నాయకుల అండదండలతో మట్టి వ్యాపారుల రాజ్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది.

గుట్టలు గుల్ల..

మండలంలోని చింతపల్లి, కురుమేడు, నసర్లపల్లి, ప్రశాంతపురి తండా, మదనాపురం, చౌల తండా, ఎర్రమట్టి తండా తదితర గ్రామాల్లో గుట్టలు కనుమరుగవుతున్నాయి. మండలంలోని మాల్, కుర్మేడ్, చింతపల్లి, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసే వెంచర్లకు మట్టిని తరలిస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. అధికారుల అండ దండలతో తమ అక్రమ మట్టి వ్యాపారాన్ని మండలంలో జోరుగా కొనసాగిస్తున్నారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి అక్రమ మట్టి వ్యా పారంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకపోతే చర్యలుతీసుకుంటాం

మండలంలో అనుమతులు లేకుండా ప్రైవేట్ వెంచర్లకు మట్టిని తరలిస్తున్నారని మాకు ఇంతవరకు సమాచారం లేదు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే శాఖ పరమైన చర్యలను తీసుకుంటాం మట్టి తవ్వకాలకు అనుమతులు తప్పనిసరి తీసుకోవాలి.

– రమాకాంత్ శర్మ, తహసీల్దార్

భూసారం కాపాడితేనే భవిష్యత్

మిర్యాలగూడ : రైతులు రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ వ్యవసాయం చేయాలని ఏడీఏలు దేవ్‌సింగ్, పోరెడ్డి నాగమణిలు అన్నారు. గురువారం ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రైతువేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. రైతులు మోతాదుకు మించి ఎరువులను వాడడం వల్ల నేలకు అవసరమైన సూక్ష్మజీవులు, భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ కారయక్రమంలో ఏఓ సైదానాయక్, ఎస్‌టీఎల్‌ఓ అర్చన, ఏఈఓలు రమేష్, షఫీ, అఫ్రిన్, గోపి, రమ్య, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడి నర్సిరెడ్డి, రైతులు రాఘవరెడ్డి, వెంకన్న, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : నేల కలుషితం కాకుండా స్థిరమైన సజీవ వనరుగా బావితరానికి అందించడం అందరి బాధ్యత అని మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రైతు వేదికలో ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేల కలుషితం కాకుండా సహజ సూక్ష్మజీవుల పరిరక్షణ కోసం, నేల సజీవ శక్తిని కొనసాగించాలన్నారు. వేసవిలో భూమిని వాలుకు అడ్డంగా దున్నడం వల్ల నేల కోతకు గురికాకుండా ఉంటుందన్నారు. భవిష్యత్ తరాలకు మంచి నేలను అందించాల్సిన భాద్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జితేందర్ గౌడ్, రైతులు లింగయ్య, సైదిమియా, సైదులు, సందీప్ పాల్గొన్నారు.


పెద్దవూర : సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెద్దవూర : రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మృత్తికా ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. రూ.2లక్షల లోపు రుణమాఫీతో పాటు రైతులు పండించిన సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చినట్లు తెలిపారు. సంక్రాంతికి వరకు రైతు భరోసా సైతం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.సందీప్, ఏఈఓలు రామాంజనేయులు, మధుకర్, స్వాతి, శారద పాల్గొన్నారు.

కూలి డబ్బులు ఇవ్వడం లేదని ధర్నా


కూలి డబ్బులు చెల్లించాలని కాటన్ మిల్లు ఎదుట రాస్తారోకో చేస్తున్న కూలీలు

కొండమల్లేపల్లి : తమకు రావాల్సిన కూలి ఇవ్వడం లేదని సుమారు 25మంది కూలీలు మిల్లు వద్ద ధర్నాకు దిగారు. దీంతో జడ్చర్ల – కోదాడ 167వ జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిన ఘటన గురువారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన 40మంది కూలీలు పనికోసం రెండు నెలల క్రితం మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న శివ గణేష్ కాటన్ మిల్లుకు వచ్చారు. అయితే వారిలో 15మంది కూలీలకు బుధవారం రాత్రి మిల్లు యజమాని కూలీ నిమిత్తం రూ.80వేల నగదు చెల్లించాడు. నగదు తీసుకున్న కూలీలు యజమానికి చెప్పకుండానే రాత్రికే రాత్రే తమ రాష్ట్రానికి వెళ్లిపోయారు. మిగిలి కూలీలు సైతం మిల్లులో పనిచేయడం ఇష్టం లేక వెళ్లిపోవటానికి తమకు రావాల్సిన కూలి నగదు చెల్లించాని కోరగా మధ్యలో వెళ్లిపోతే మిల్లు నడవడం కష్టంగా ఉంటుందని కొంత నగదుప్పుడు చెల్లిస్తానని పని పూర్తయ్యాక మొత్తం చెల్లిస్తానని యజమాని తెలిపారు. మొత్తం ఇప్పుడే చెల్లించాలని కూలీలు ధర్నాకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసు స్టేషన్‌కు పిలిపించి సర్దిచెప్పడంతో యథావిధిగా కూలీలు మిల్లుకు వెళ్లిపోయారు.

గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ : తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం దామరచర్ల మండల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బాణావత్ సైకిలాబ్‌నాయక్, అధ్యక్షుడిగా గుగులోతు రాందాస్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రమావత్ బాలునాయక్, ఉపాధ్యక్షులుగా హరికిషన్, బుజ్జి, కోశాధికారిగా హరి, కార్యదర్శులుగా బాబునాయక్, బాబ్లనాయక్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఎంవీఎన్‌కు నివాళి

మిర్యాలగూడ అర్బన్ : సీపీఎం నాయకుడు మల్లు వెంకట నర్సింహారెడ్డి వర్ధంతిని స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికారు మల్లేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవి నాయక్, అయూబ్, శశిధర్‌రెడ్డి, పరశురాములు, రామ్మూర్తి, అరుణ, గోవర్ధన, రమేష్, హరిబాబు, శ్రీను, చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని మస్జిదే సరాయి మీరాలం కమిటీ ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని వక్ఫ్‌బోర్డు సీఈఓ మహమ్మద్ అసదుల్లాకు మసీదు కమిటీ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎంఏ నాహీద్, సమీఖాద్రీ, సీనియర్ జర్నలిస్టు ఖాజాహమీదుద్దీన్, జాహంగీర్, ముజీబ్, మోహిద్, ఖమర్‌లు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక అవసరాల వస్తువులు పంపిణీ

వేములపల్లి : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని రావులపెంట ప్రాథమిక పాఠశాలకు చెందిన పసుల ప్రేమ్‌కుమార్‌కు వీల్‌చైర్, వేములపల్లికి చెందిన పగడాల మణిదీప్‌కు హియరింగ్ ఎయిడ్‌ను గురువారం ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల తమ వైకల్యాన్ని చూసి కుంగిపోకుండా అందరితో సమానంగా అద్భుతాలు సృష్టించాలన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, ఐఈఆర్‌పీలు చంద్రశేఖర్, శ్రీనివాస్, ఎమ్మార్సీ సిబ్బంది లక్ష్మీ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.


హియరింగ్ ఎయిడ్‌ను అందజేస్తున్న ఎంఈఓ

చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

మిర్యాలగూడ టౌన్ : లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ ఆర్. మమత అన్నారు. గురువారం మిర్యాలగూడ పరిధిలోని దుబ్బతండాలో ఎంజేపీటీ బీసీ సంక్షేమ పాఠశాలలో ప్రజా పాలన–ప్రజా విజయోత్సవంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బాలలపై లైంగిక వేధింపుల నిరోదక చట్టం'పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్య క్రమంలో సభ్యులు శ్రీదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, టీచర్లు నస్రీన్, అజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వాణి, రాధిక, సుశీల, హేమదేవి ఉన్నారు.

మిర్యాలగూడ : ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా దామరచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీలో కిశోర బాలికలకు గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రజిని, మల్లేశ్వరి, నాగరాణి, లక్ష్మీ, మాధవి, విజయ, సంధ్య, విజయలక్ష్మీ, పాఠశాల ఎస్ఓ అరుణ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు.

త్రిపురారం : సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, బాలికల స్థాయి నుంచే క్రమ శిక్షణ పట్టుదలతో చదువుకొని ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని సీడీపీఓ ఉదయ శ్రీ అన్నారు. గురువారం నిడమనూరు మండలంలోని టీఎస్ మోడల్ స్కూల్, కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సువర్ణ, సూపర్ వైజర్లు సైదాబేగం, రాజారాజేశ్వరి, లీగల్ అడ్వైజర్ వెంకన్న, రాజేశ్వరి పాల్గొన్నారు.


త్రిపురారం : కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీపీడీఓ ఉదయశ్రీ

సమ్మె నోటీసు అందజేత

గుర్రంపోడు : తమ సమస్యల పరిష్కారానికి ఆందోళనలో భాగంగా సమగ్రశిక్ష ఉద్యోగుల రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 10వతేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇటికాల రమేష్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు యాట వెంకట్‌లు తెలిపారు. ఈ మేరకు గురువారం సమ్మె నోటీసును మండల విద్యాధికారి నోముల యాదగిరికి అందించి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు, పీటీఐలు, మెసెంజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీసును గురువారం ఎంఈఓ అందజయ్యకు పీఆర్‌టీయూ, టీఎస్ యూటీఎఫ్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగస్తులను వారి సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్సీ సిబ్బంది సీఆర్పీ లు పీటీఐలు ఈఈఆర్పీలు పాల్గొన్నారు.

త్రిపురారం : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు వజ్జ మల్లయ్య కోరారు. గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నిడమనూరు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం మందు నిరసన వ్యక్తం చేసి ఎంఈఓ లావురి వెంకన్న నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, శంకర్, గంగరాజు, ఆంజనేయులు, వసంత, రాములు, వెంకటేశ్వర్లు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల ట్రయల్‌రన్ ప్రారంభం

పెద్దవూర : కుంకుడుచెట్టుతండా ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్‌ను గురువారం మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా ఏఎంసీ చైర్మన్ తుమ్మపల్లి చంద్రశేఖర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దవూర, తిరుమలగిరిసాగర్ మండలాలలోని 7150 ఎకరాలకు సాగునీటిని అందించే ఉద్దేశ్యంతో డీ–8,9 కాలువ ద్వారా మండలంలోని పూల్యాతండా సమీపంలో వరద కాలువపై కుంకుడుచెట్టుతండా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏఎమ్మార్పీ కాలువ డీ–8,9 కాలువ ద్వారా చివరి భూములకు సాగునీరు అందక పెద్దవూర, తిరుమలగిరి సాగర్ మండలాల రైతులు ఇబ్బందులు పడేవారని తెలిపారు. దీంతో వరద కాలువ పంప్‌హౌజ్‌కు ప్రత్యేకంగా మోటార్‌లను బిగించి డీ–8,9 కాలువకు నీటిని లిఫ్టు ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ లిఫ్టు ద్వారా కుంకుడుచెట్టుతండా, గాత్‌తండా, తూటిపేట తండా, పాశంవారిగూడెం, జానారెడ్డి కాలనీ, రంగుండ్ల, ఎల్లాపురంతండాలకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, ఏఎంసీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు పగడాల నాగరాజు, మునినాయక్, అంజి, లాలు, భాస్కర్‌నాయక్, సర్దార్, చందు, పాండు, శంకర్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎత్తిపోతల ట్రయల్ రన్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

యువజన కాంగ్రెస్ కమిటీల ఎన్నిక


హరిప్రసాద్


అజారొద్దిన్


పర్వేజ్


కిన్నెర హరికృష్ణ

మిర్యాలగూడ : యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దామరచర్ల మండలం పుట్టలగడ్డకు చెందిన రూపావత్ హరిప్రసాద్ ఎన్నికయ్యారు. ఎన్ఎస్‌యూఐలో బాధ్యతలను చేపట్టిన హరిప్రసాద్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కృషి చేశాడు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా అజారొద్దిన్

మిర్యాలగూడ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన షేక్ అజారొద్దిన్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అజారొద్దిన్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో యువజన కాంగ్రెస్ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా పర్వేజ్

యువజన కాంగ్రెస్ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడిగా షేక్ పర్వేజ్ ఎన్నికయ్యారు. మూడు నెలల క్రితం ఆన్‌లైన్‌లో యువజన కాంగ్రెస్ ఎన్నికలు నిర్వహించగా పర్వేజ్‌కు 900కు పైగా ఓట్లు వచ్చాయి. అత్యధిక ఓట్లు రావడంతో పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికై నట్లు యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు ప్రకటించారు. పర్వేజ్ ఎన్నికపై జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అజహర్, నాయకులు జావీద్, మోయిజ్, జానిపాషా, షఫి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

దేవరకొండ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా హరికృష్ణ


సాయికుమార్

దేవరకొండ : యువజన కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా దేవరకొండకు చెందిన కిన్నెర హరికృష్ణ రెండోసారి ఎన్నికయ్యారు. 2007లో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన హరికృష్ణ 2020లో మొదటి సారిగా యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతరం బుధవారం వెలువడిన ఫలితాల్లో ఆయన రెండోసారి యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ ఓటింగ్‌లో తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే బాలునాయక్‌తో పాటు కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞలు తెలిపారు.

మండల అధ్యక్షుడిగా సాయికుమార్

పెద్దవూర : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన రేపాకుల సాయికుమార్‌యాదవ్ ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేజయవీర్ రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పబ్బు యాదగిరి, పగడాల నాగరాజులకు ధన్యవాదాలు తెలిపారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన ఆర్‌వీ ప్రసాద్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. అతడు మరణించినా.. సమాజానికి ఉపయోగపడాలన్న కోరిక మేరకు ఆయన మృతదేహాన్ని ఆర్‌వి.ప్రసాద్ భార్య భార్య లక్ష్మి, కూతుళ్లు సత్య, రమ్యల అంగీకారంతో నల్లగొండ వైద్య కళాశాలకు అప్పగించారు. ఆయన మృతదేహాన్ని మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీడీ.రవికుమార్, శ్రీధర్ రెడ్డి, బాలకృష్ణ, రంగారావు, అమ్రాన్ అన్నారు.

హామీలు అమలు చేయాలని ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల యట్టయ్య అన్నారు. గురువారం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సైదమ్మ, కాశి, జ్యోతి, చంద్రకళ, భరత్, మురళి, ప్రేమ్‌కుమార్, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

త్రిపురారం : నిడమనూరు మండలంలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో 5నుంచి 10వ తరగతి వరకు బాలికలకు బోధించుటకు ఖాళీగా ఉన్న ఫిజిక్స్(పీజీటీ)ఉద్యోగానికి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఊశారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ బీఈడీ అర్హత ఉండి ఆంగ్లమధ్యమంలో బోధించాల్సి ఉంటుందని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాల సమయంలో దరఖాస్తు సమర్పించి డెమోలో పాల్గొనాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7995010668ను సంప్రదించాలని తెలిపారు.

ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి


దేవరకొండ ఆదర్శ పాఠశాలలో భోజనం రుచి చూస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత

దేవరకొండ: మండల పరిధిలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను గురువారం రాత్రి దేవరకొండ సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె. అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గదిని పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆమె స్వయంగా రుచి చూశారు. బియ్యం, కూరగాయలతో పాటు రాత్రి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటను, విద్యార్థుల గదులు, వసతి గృహం పరిసరాలను పరిశీలించి సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. ప్రతిరోజు వసతి గృహం పరిసరాలను, గదులను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బంది సూచించారు. మె వెంట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. రవీందర్, అడిషనల్ జూనియర్ సివిల్ జిడ్జి కేవీఎస్ హరీష్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు, న్యాయవాదులు రాములు, షౌకత్ అలీ, ఉమామహేష్, జగదీశ్వర్, రమేశ్, ఎర్ర కృష్ణ, పాల్గొన్నారు.

నాణ్యమైన వంట సరుకులు వినియోగించాలి

త్రిపురారం : సంక్షేమ హస్టళ్లల్లో విద్యార్థులకు అందించే భోజనానికి నాణ్యమైన వంట సరుకులు వినియోగించాలని త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రాజీవ్ కాలనీలో ఉన్న ఎస్టీ మినీ గురుకులాన్ని వైద్యసిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పరిసరాలు, వంట సరుకులు పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుకోవాలి, గోర్లల్లో మట్టి లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య బృదం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

డిండి : విద్యార్థులకు అందించే భోజన విషయంలో నాణ్యత పాటించాలని ఎంఈఓ గోప్యానాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో తయారు చేసిన భోజనాన్ని పరిశీలించి అక్కడే విద్యార్థినులతో కలిసి ఆయన భోజనం చేశారు. విద్యార్థినులకు అందించే భోజన మెనూను ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీ, కేర్‌టేకర్ అశ్విని, ఏఎన్ఎం వెంకటమ్మ, పల్లె వెంటయ్య తదితరులు పాల్గొన్నారు.